ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలున్నా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ	:9985445760
ధర్మవరం, పుట్టపర్తి	: 9963160529
కదిరి	:9052518170

ఏసీఎమ్: 9985411154

అగ్నికి ఆహుతైన అరటి తోట

రూ.9 లక్షలు నష్టం



అగ్నికి ఆహుతైన అరటిచెట్లు

తాడిమర్రి, జూన్ 29: రెండో పంట గెలలు బాగా వచ్చాయి, ధర కూడా టన్ను రూ.18వేలు పలుకుతోంది. అమ్మేసి అప్పులు తీర్చుకోవచ్చు అనుకున్న రైతుల ఆశలు బూడిదయ్యాయి. గుర్తుతెలియని దుండగులు శుక్రవారం రాత్రి తోటకు నిప్పుపెట్టడంతో 3.6ఎకరాల భూమిలో సాగు చేసిన 5,460 అరటి చెట్లు కాలిబూడిదయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... లింగాల మండలం పార్నపల్లికి చెందిన ముగ్గురు రైతులు తాడిమర్రి మండలం తురకవారిపల్లి గ్రామంలో 3.6 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అరటిపంట సాగు చేశారు. మొదటి పంట పూర్తి అయ్యి ప్రస్తుతం రెండో పంట కోత దశలో ఉంది. ఇలాంటి సందర్భంలో తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అరటి చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు, అరటి గెలలు పనికిరాకుండా పోయాయి. దీంతో రూ.9లక్షలు దాకా నష్టం వాటిల్లినట్లు రైతులు మొరుసు శ్రీనివాసులు, మొరుసు వెంకటరమణ, మొరుసు క్రిష్ణమనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాడిమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. అరటితోటను స్థానిక గ్రామ ఉద్యాన అధికారి రామాంజినేయులు, పోలీసులు పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి, నివేదికను తయారు చేసుకున్నారు.

ఈవీఎంల పరిశీలన



గోడౌన్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్

ధర్మవరం, జూన్ 29: రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని మార్కెట్‌యార్డ్ గోదాములో భద్రపరచిన ఈవీఎంలను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ప్రతిమూడు నెలలకు ఒకసారి విధిగా ఈ యంత్రాలను పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల అధికారుల నుంచి ఉత్తర్వుల వచ్చాయన్నారు. ఈ తనిఖీలు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో నిర్వహించిన ట్లు వెల్లడించారు. అక్కడి వివరాలను ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. భద్రతపట్ల మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రమేశ్‌బాబు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పార్థసారథికి ఘన స్వాగతం



బెంగళూరు విమానాశ్రయం వద్ద బీకేకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పెనుకొండ, జూన్ 29: లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలి సారి పెనుకొండకు వచ్చిన హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథికి నాయకులు, అధికారులు, అభిమానులు, కార్యకర్తలు శనివారం ఘనస్వాగతం పలికారు. ఉదయం బెంగళూరు ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి పుష్ప గుచ్చాలు అందజేశారు. కొడికొండ చెక్‌పోస్టు, బాగేపల్లి టోల్‌గేట్ వద్ద ఆయనకు ఘనస్వాగతం లభించింది. పెనుకొండలోని ఎంపీ కార్యాలయంలో కూడా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై పూలమాలలు వేసి, పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు.

అలరించిన భక్తి గీతాలు



పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి: బాపట్ల జిల్లా సేవాదళ్ నిర్వహించిన భక్తి ఆలాపన సత్యసాయిబాబా భక్తులను అలరించింది. పర్తి యాత్ర పేరుతో బాపట్ల సేవాదళ్ సభ్యులు శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సంగీ త సుధామాధురి పేరిట సంగీత గాన కచేరి నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



గత ఏడాది ఎండిపోయిన వేరుశనగ (ఫైల్)

రోజు రోజుకు వ్యవసాయం భారంగా మారుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో పెట్టుబడులు కూడా రాక అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. దీనికితోడు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, కూలీలు ధరలు పెరగడంతో పంటల సాగుకు జంకుతున్నాడు. ప్రభుత్వాల చేయూత లేక వ్యవసాయం దండగగా మారడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. వరుస నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతన్న ఈ ఏడాది పొలంలో దుక్కులు చేయడానికి కూడా చేతిలో చిల్లిగవ్వలేక సాగుకు దూరమవుతున్నాడు.

- గాండ్లపెంట

కాడి వదిలేద్దామా !

భారమవుతున్న వ్యవసాయం

- ఏటా నష్టాలే.. అప్పుల ఊబిలో అన్నదాత
- సాగుకు జంకుతున్న రైతులు
- బీళ్లుగా మారిన పంట పొలాలు

వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానించాలి

వ్యవసాయం చేసే ప్రతి రైతు కూలీలపై ఆధారపడాల్సిందే. కూలీలు దొరక్క ఒకవైపు, కూలి రేట్లు పెరగడంతో చెల్లంచలేక మరోవైపు అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా ఉన్న కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. దీంతో పంటల్లో కలుపు తీత, వరినాట్లు, ఇతర పనులు చేయించ డానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఈక్రమంలోనే పలువురు రైతులు సేద్యం చేసి ఇబ్బందులు పడే కంటే ఊరికే ఉండటం ఉత్తమమని అభిప్రాయపడుతున్నారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీల బాధలు తగ్గి రైతులకు కాస్త ఉపశమనం కలిగే అవకాశం ఉంది. అందుకే ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయమని చాలా రోజుల నుంచి రైతులు, రైతు సంఘాలు కోరుతున్నాయి.

బీళ్లుగా మారుతున్న వ్యవసాయ పొలాలు

ప్రతిఏటా వరుసగా నష్టాలే వస్తుండటంతో రైతులు పంటలు సాగు చేయకుండా పొలాలను బీళ్లుగా వదిలేస్తున్నారు. ఈఏడాది ముందస్తుగా వర్షాలు కురిసినా పొలాలను దుక్కులు చేయడానికి రైతులు మొగ్గు చూపలేదు. పొలం దుక్కి చేయించాలంటే ట్రాక్టర్‌కు గంటకు రూ. వెయ్యి అద్దె చెల్లించాల్సి ఉంది. ఇది కరువుతో అల్లాడే రైతుకు భారంగా మారింది. అందుకే గత ఏడాది చేసిన అప్పులే తీర లేదు. ప్రస్తుతం అప్పులు దొరికే పరిస్థితి లేదని రైతన్న కాడి వదిలేస్తున్నాడు. మండలంలో అరకొరగా దుక్కిలు చేసి, విత్తనాలు విత్తుతున్నారు. మిగతా చోట్ల ఎటు చూసిన బీడు భూములే దర్శనమిస్తున్నాయి.

ఈ ప్రభుత్వమైనా ఆదుకోవాలి




గత ఏడాది నాకున్న నాలుగు ఎకరాల తడి భూమిలో బొప్పాయి సాగుచేశా. రూ. నాలుగు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టా. అయితే చీడపీడలు అధికం కావ డంతో పూర్తిగా నష్టపోయా. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్బీకే అధికారులు పంటను పరిశీలించి, ప్రభుత్వం సాయం చేస్తుందని భరోసా ఇచ్చారు. అయితే ఇంతవరకు ఎలాంటి సాయం అందించలేదు. అందుకే ఈ ఏడాది పంట సాగు చేయడానికి ఆసక్తి కూడా లేకుండా పోయింది. కనీసం ఇప్పటి ప్రభుత్వమైనా మమ్మల్ని ఆదుకోవాలి.

- టోపీసాబ్, రైతు, గాండ్లపెంట

ఏటా నష్టాలే : రమణ, రైతు, గాండ్లపెంట



నాకు ఐదు ఎకరాల్లో మెట్ట, తడి భూమి ఉంది. మెట్ట భూముల్లో ఏటా వేరుశనగ సాగుచేస్తున్నా. అయితే ఎప్పుడో తప్పా ప్రతిఏటా నష్టాలే వస్తున్నాయి. గత వైసీప ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎలాంటి సాయం అందించ లేదు. పంటల సాగుకు చేసిన అప్పులకు కనీసం వడ్డీలు కూడా కట్టలేకపోతున్నాం. నష్టాలను భరించలేక వ్యవసాయం వదులుకోవాల్సి వస్తోంది. ఈ ప్రభుత్వమైనా నష్టపోయి రైతులను ఆదుకోవాలి.



బీళ్లుగా మారిన పొలాలు

పోటెత్తిన భక్తులు

కిక్కిరిసిన ఖాద్రీశుని ఆలయం



స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కదిరి, జూన్ 29: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వంజ స్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి..



ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చిగురిస్తున్న ఆశలు

ఎంఎస్ఎంఈ పార్కుల్లో మళ్లీ కదలిక

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో పారిశ్రామికవాడల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. వైసీపీ పాలనతో ఆగిపోయిన పనుల్లో కదలిక రానుంది. ఈక్రమంలోనే జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధి పనుల్లో కదలిక మొదలైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడటంతో జిల్లాలో ఏర్పాటు చేయదలచిన పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయి. నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు పరుగులు పెట్టారు. ప్రస్తుతం టీడీపీ కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి పూర్వ వైభవం వస్తుందన్న ఆశలు రేకెత్తుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

- వైసీపీ పాలనలో కుంటుపడిన పారిశ్రామిక ప్రగతి
- కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో పూర్వ వైభవం !
- ఉపాధి దొరుకుతుందని నిరుద్యోగుల ఆశలు



కప్పలబండ పారిశ్రామిక వాడ

దక్షిణ కొరియా కార్ల దిగ్గజ సంస్థ కియ రాకతో జిల్లాలో వందలాది అనుబంధ సంస్థలు ఏర్పడ్డాయి. వీటిలో పని చేస్తూ వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. అయితే కియ ప్లాంటు విస్తరణ జరగలేదు. ఇప్పటికే మేడిన్ ఇండియాలో తొలి కారు సెల్టోస్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అయితే కియకు అనుబంధంగా భవిష్యత్తులో ఎలక్ట్రికల్ హైబ్రిడ్ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు గత ఏడాదే ప్లాంటులో కెఎంఐ కేంద్రంలో ప్రొడక్షన్ లైన్లను డిజైన్ చేశారు. వీటికి తోడు పెనుకొండ, పాలసముద్రం, గోరంట్ల, గుడిపల్లి వద్ద 424 ఎకరాల్లో 30కిపైగా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేశారు. కియతోపాటు అనుబంధ సంస్థల నిర్మాణంతో పెట్టుబడుల వరద వచ్చింది. కియతోపాటు అనుబంధ సంస్థల ఏర్పాటుతో ప్రత్యక్షంగా 30 వేల మంది, పరోక్షంగా మరో 25వేల మందికిపైగా ఉపాధి లభిస్తోంది. కియ రాకతో సొంత ఊర్లోనే ఉపాధి లభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో వలసలు తగ్గాయి. ఇతర ప్రాంతాల వారే ఉపాధి కోసం ఇక్కడకు క్యూ కడుతున్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక పారిశ్రామికాభివృద్ధిలో చొరవ చూపకపోవడంతో కియ ప్లాంటు విస్తరణ జరగలేదు. దీంతో యువత పొరుగు రాష్ట్రానికి మళ్లీ పరుగులు పెట్టారు. టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ జిల్లాకు పెట్టుబడుల వరద క్యూకట్టే రోజులు దగ్గర పడ్డాయని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు.

పెట్టుబడుల వరద

ఐదేళ్లూ అరచేతిలో వైకుంఠం

వైసీపీ ఐదేళ్ల పాలనా కాలంలో పారిశ్రామిక అభివృద్ధిపై అరచేతిలో వైకుంఠం చూపారు. విశాఖపట్నం వేదికగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 నిర్వహించారు. ఈ సదస్సుల్లో రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు వెల్లడించారు. దీంతో జిల్లాకు కూడా పరిశ్రమలు వస్తాయని, ఉపాధి దొరుకుతుందని నిరుద్యోగ యువత ఆశించింది. కానీ అవి ఏవీ సాకారం కాలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రకటలే తప్ప జిల్లాకు ఒక్క కొత్త పరిశ్రమ రాలేదు. పారిశ్రామికాభివృద్ధి కోసం టీడీపీ పాలనలో జిల్లాలో ఏపీఐఐసీ సిద్ధం చేసిన భూములు, ఎంఎస్ఎంఈ పార్కుల్లో భూముల ధరలను కొత్త పాలసీల పేరుతో వైసీపీ పెంచేసింది. కియ కార్ల పరిశ్రమ అమ్మవారుపల్లి, ఎర్రమంచి ఎంఎస్ఎంఈ పార్కులో ఎకరా విలువ రూ.1.23 కోట్ల నుంచి రూ.1.53 కోట్ల దాకా పెంచారు. గోళ్లాపురం పారిశ్రామిక వాడలో రూ.75 లక్షలు గుండిపల్లి రూ.83లక్షలు, కప్పలబండ రూ.70లక్షలు, కొటిపి వద్ద రూ. 52లక్షలు చొప్పున వైసీపీ ప్రభుత్వం ధరలు నిర్ణయించింది. దీంతో పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టడానికి వెనక్కి జంకారు. పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు రాయితీతోపాటు అన్ని అనుమతులు ఇచ్చి ప్రోత్సహించాల్సి ఉన్నా, భూముల కేటాయింపు, మౌలిక సదుపాయాల ఏర్పాటు పేరుతో వైసీపీ ప్రభుత్వం వ్యాపారం చేసింది. 2021లో పెనుకొండ ప్రాంతాన్ని టఫే ట్రాక్టర్ల ఉత్పత్తి కంపెనీ వారు పలు మార్లు చూసి, చివరకు వెనక్కి తగ్గారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో జిల్లాలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




కప్పలబండ ఎంఎస్ఎంఈ పార్కులో మొదలైన పనులు

కియ రాకతో..

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములను 2014-19లో టీడీపీ పాలనలోనే గుర్తించారు. గోరంట్ల- సోమందేపల్లి, పాలసముంద్రం, గుడిపల్లి వద్ద 2015లో నేషనల్ అకాడమి ఆఫ్ కస్టమ్స్ ఎక్సైజ్ నార్కొటిక్స్, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్(బీఈఎల్-బెల్) వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించారు. కియ రాక ఉమ్మడి జిల్లాకు పారిశ్రామికవేత్తలను ఆకర్షించింది. గుడిపల్లి పారిశ్రామిక వాడలో 209.18 ఎకరాలలో 14 పరిశ్రమలు ఏర్పాటు చేశారు. కియ కార్ల పరిశ్రమ రాకతో ఆ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా విస్తరించింది. ఇప్పటికే సేకరించిన భూముల్లో ఏపీఐఐసీ మౌలిక సదుపాల కల్పన చేపట్టి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అప్పగించేందుకు సిద్ధం చేసింది. పెనుకొండ, పాలసముద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర రాళ్లఅనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద పరిశ్రమల కోసం 8వేల ఎకరాలకుపైగా గుర్తించారు. 2500 ఎకరాలు ఇప్పటికే సిద్ధంగా ఉంది. పెనుకొండ అమ్మవారుపల్లి, కప్పలబండ, కొటిపి, గోళ్లాపురం, గుడిపల్లి వద్ద ఎంఎస్ఎంఈల ఏర్పాటుతో ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐదేళ్ల తరువాత పరిశ్రమలు క్యూకట్టే రోజులు వచ్చాయి. పారిశ్రామికవాడల్లో మళ్లీ మౌలిక సదుపాయాల కల్పన పనులు మొదలు పెట్టారు. టీడీపీ పాలనలో భారీ పరిశ్రమ యూనిట్ ఏర్పాటుతో జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా బెంగళూరు, చెన్నైయ్ కారిడార్‌కు అనుసంధానంగా మారుతుందని జిల్లా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



పింఛన్ పంపిణీకి సర్వం సిద్ధం



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టరు, అధికారులు

పుట్టపర్తి, జూన్ 29: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టరు అరుణ్‌బాబు తెలిపారు. అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ జూలై 1న పింఛన్ల పంపిణీపై శనివారం సమీక్ష చేశారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో 270966 మంది పింఛన్‌దారులున్నారని, వీరికి రూ.184.70 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. జిల్లాలోని 54 సచివాలయాల్లో ఉన్న 4349 మంది ఉద్యోగుల ద్వారా పింఛన్లను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా సచివాలయాలకు మొత్తం నిధులను అందచేసినట్లు కలెక్టరు వివరించారు. పింఛన్ల పంపిణీని సోమవారం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ అధికారి శివారెడ్డి, డీఎల్‌పీఓ శివకుమారి, ఎల్డీఎం రమణకుమార్, డీపీఓ ఏఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ. 184.7 కోట్లు విడుదల



పుట్టపర్తి, జూన్ 29: జిల్లాలో సోమవారం పింఛన్ పంపిణీ చేసేందుకు నిధులు విడుదలైనట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. తన కార్యాల యంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 2,70,966 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, వీరికి రూ.184.70 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ సొమ్ము బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసి ఆయా మండలాలకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నూతన ప్రభుత్వం పెంచిన పింఛన్ సొమ్ము మొత్తాన్ని సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తామన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లకు మహర్దశ



- నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వసతి గృహాలు
- మొదటి విడతగా రూ.1.35 కోట్లు
- కూటమి అధికారంలోకి రాగానే హాస్టళ్ల మెరుగుకు అడుగులు
- 10 ఎస్సీ వసతి గృహాలు.. ఒక అంబేడ్కర్ గురుకులం ఎంపిక
- బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాలకూ అవకాశం దక్కేనా..?

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్29 : జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లుగా సంక్షేమ వసతిగృహాలు అరకొర వసతుల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. పెచ్చులూడిన పైకప్పులు, శిథిలమైన భవనాలు, మరుగుదొడ్లు, తాగునీటి లేమితో అటు విద్యార్థులు... వార్డెన్లు నరకం అనుభవించారు. నాలుగేళ్లల్లో పలు దఫాలుగా నిధులు కేటాయించాలని ఆయా సంక్షేమశాఖల అధికారులు గత ప్రభుత్వానికి నివేదికలు పంపినా అవన్నీ చెత్తబుట్టకే పరిమితం కావడంతో అరకొర వసతుల నడుమే విద్యార్థులు వసతి పొందాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. విద్యార్థుల కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' పలు దఫాలుగా పదుల సంఖ్యలో కథనాలను ప్రచురించింది. విద్యార్థుల అవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కళ్లకు కట్టినట్లుగా కథనాల రూపంలో చూపించింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే మరోసారి ఆంధ్రజ్యోతిలో ఈ నెల 19న నాలుగేళ్లుగా వసతిగృహాల దుస్థితిపై ప్రధానంగా కథనాన్ని ప్రచురించింది. దీనిపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రత్యేక ఎంపీడీఓలు, తహసీల్దార్లతో హాస్టళ్లను పరిశీలన చేయించి నివేదికలను తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించిన నేపథ్యంలో... నిధులను కేటాయించాలని కలెక్టర్ నిర్ణయించారు. మొదటి విడతగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 10 ఎస్సీ హాస్టళ్లు, కురుగుంటలోని ఓ అంబేడ్కర్ గురుకులాన్ని ఎంపిక చేశారు. వీటి కోసం దాదాపు రూ. 1.35 కోట్లు విడుదల చేశారు. మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నాలుగేళ్లుగా వసతుల లేమితో ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, వార్డెన్లు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.



హాస్టళ్ల దయనీయ పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాలు

20 రోజుల్లో వసతి గృహాల్లో మార్పులకు శ్రీకారం...

వసతిగృహాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి అడుగులు వేయడంలో జిల్లా కలెక్టర్, ఎస్సీ సంక్షేమశాఖ జేడీ పాత్రలు కీలకమనే చెప్పాలి. వసతిగృహాల దయనీయ పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు చేర్చడంలో జేడీ మధుసూదన్‌రావ్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి. జేడీ అందించిన నివేదికలు, క్షేత్రస్థాయిలోకి కలెక్టర్ వెళ్లడం వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. రోజుకో హాస్టల్‌ను పరిశీలించి సమస్యలపై దృష్టి సారించారు. అందుకు కావాల్సిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధంగా చేశారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లను నియమించి జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లలో పరిశీలనకు పంపారు. ఆ పరిశీలనలో హాస్టళ్ల దుర్భర పరిస్థితులను ఆయా ఎంపీడీఓలు, తహసీల్దార్లు కలెక్టర్‌కు నివేదికల రూపంలో అందజేశారు. వాటిని రాష్ట్రస్థాయి అధికారులు, ప్రభుత్వం దృష్టికి జిల్లా కలెక్టర్ తీసుకెళ్లినట్లు సమాచారం. ఇందుకు ముందుగా జిల్లా బడ్జెట్‌ను వినియోగించుకోవాలని... తరువాత ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందినట్లు అధికారిక వర్గాల ద్వారా అందిన సమాచారం. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ మొదటి విడతగా కొన్ని హాస్టళ్లను ఎంపిక చేసి రూ. 1.35 కోట్లు నిధుల విడుదలకు ఆమోదం తెలిపారు. ఇలా వసతిగృహాల మరమ్మత్తులకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు చేసిన కృషి పట్ల పలువురు వార్డెన్లు, సంక్షేమశాఖల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టళ్ల మరమ్మతులకు కేటాయించిన నిధులు

అనంతపురం ఎస్సీ గర్ల్స్ హాస్టల్-1	రూ. 10,82,400
ఎస్సీ గర్ల్స్ హాస్టల్-2	రూ. 11,93,100
రాయదుర్గం ఎస్సీ బాలుర వసతి గృహం	రూ. 11,25,450
శెట్టూరు ఎస్సీ బాలుర వసతిగృహం	రూ. 10,14,750
గుంతకల్లు ఎస్సీ బాలికల వసతి గృహం నెం-1	రూ. 5,90,400
ఎస్సీ బాలికల వసతిగృహం నెం-2	రూ. 8,36,400,
తాడిపత్రి బాలుర వసతి గృహం	రూ. 17,83,500
శింగనమల బాలుర వసతిగృహం	రూ. 13,53,000
రాకెట్ల ఎస్సీ బాలుర వసతిగృహం	రూ. 10,14,750
కూడేరు ఎస్సీ బాలుర వసతి గృహం	రూ. 12,54,600
కురుగుంట అంబేడ్కర్ గురుకులం	రూ. 22,50,000

మొత్తం రూ. 1,35,82,850 కోట్లు నిధులను కేటాయిస్తూ త్వరితగతిన మరమ్మత్తులు పూర్తి చేయాలని ఏపీ విద్యాసంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఏఈని కలెక్టర్ ఆదేశించారు.

బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాలు మరమ్మతులకు నోచుకునేనా..?

ఎస్సీ వసతిగృహాల మరమ్మత్తులకు రూ. 1.35 కోట్లు కేటాయించడంతో... బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాల మరమ్మతులు జరుగుతాయని ఆయా సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లు ఆశలు పెట్టుకున్నారు. ఆయా సంక్షేమశాఖల పరిధిలో జిల్లా వ్యాప్తంగా చాలా వసతి గృహాలు శిథిలమయ్యాయి. అందులో ప్రమాదకర స్థితిలో ఉన్న వాటిని పరిశీలిస్తే... ఆమిద్యాలలోని బీసీ హాస్టల్ పూర్తిగా శిథిలమైంది. పై కప్పు పెచ్చులూడిపోవడంతో... చిన్నపాటి వర్షానికే గదుల్లో నీరంతా కారుతోంది. అందులోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ వసతి పొందుతున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో బయటి బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో బయటి ప్రాంతాలకు వెళ్తున్నారు. గుత్తి కొండ కింద ఉన్న బీసీ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలమైంది. ఎప్పుడు కూలుతుందోనన్న భయానకర పరిస్థితుల నడుమ విద్యార్థులు వసతి పొందుతున్నారు. కంబదూరులోని బీసీ వసతిగృహం సైతం పూర్తిగా శిథిలమైంది. రుద్రంపేటలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో కొన్ని గదులకు తలుపులు లేవు. గార్లదిన్నె మైనార్టీ గురుకులంలో తాగునీటి వసతి విద్యార్థులను పట్టిపీడిస్తోంది. ఇవన్నీ మచ్చుకు వసతిగృహాల్లోని సమస్యలు మాత్రమే పదుల సంఖ్యల వసతిగృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే సంక్షేమ వసతిగృహాలకు పూర్వవైభవం వస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆయా సంక్షేమశాఖల ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ సమస్యలు ఎదుర్కొంటున్న హాస్టళ్ల నివేదికలను పంపినట్లు తెలుస్తోంది.

అరకొర వసతుల మధ్యే హాస్టళ్లు...

జిల్లాలో నాలుగేళ్లుగా దాదాపు వసతిగృహాలు అరకొర వసతుల నడుమ కొనసాగాయనే చెప్పాలి. ఈ నేపథ్యంలోనే మొదట విడతగా అత్యధిక సమస్యలున్న వసతి గృహాలను ఎంపిక చేశారు. ఆ వసతిగృహాల్లో ప్రధానంగా ఎలక్ట్రికల్, రూఫ్, పెయింటింగ్, ఆర్వో ప్లాంట్ మరమ్మతులు, కొన్ని చోట్ల కొత్త ఆర్వో ప్లాంట్లు, పైపులైన్ లీకేజీలు, డ్రైనేజీలు ఉన్నట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా 10 ఎస్సీ వసతిగృహాలు, ఒక అంబేడ్కర్ గురుకులాన్ని ఎంపిక చేశారు.

వసతిగృహాలకు పూర్వ వైభవం : మధుసూదన్‌రావు, జేడీ, ఎస్సీ సంక్షేమశాఖ



ఎస్సీ వసతిగృహాలకు పూర్వవైభవం వస్తుందని ఆశిస్తున్నాం. సమస్యలున్న హాస్టళ్ల వివరాలను జిల్లా కలెక్టర్‌కు వివరించాం. కలెక్టరే స్వయంగా హాస్టళ్లను పరిశీలించారు. మొదటి విడతగా జిల్లాలో అత్యంత సమస్యల నడుమ ఉన్న 10 ఎస్సీ వసతిగృహాలను మరమ్మతులకు ఎంపిక చేశాము. అవన్నీ పూర్తవగానే మిగిలిన వసతిగృహాలకు సంబంధించి నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపడం జరుగుతుంది. ఏదేమైనా ఈసారి వసతిగృహాలు పూర్తిస్థాయిలో మరమ్మత్తులుకు నోచుకుంటాయి. విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తారని ఆశిస్తున్నాం. ఈ విషయంలో కలెక్టర్ పాత్ర చాలా కీలకమనే చెప్పాలి.

ఐటీఐ ప్రవేశాలకు ద్వితీయ కౌన్సెలింగ్

అనంతపురం సెంట్రల్, జూన్ 29: ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు ద్వితీయ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యిందని బాలుర ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి శనివారం తెలిపారు. ఇప్పటికే ప్రథమ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి అయ్యిందని, ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ద్వితీయ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. జూలై 27వరకు ఐటీఐ.ఏపీ.జీఓవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

8నుంచి ఎస్కేయూ తరగతులు

అనంతపురం సెంట్రల్, జూన్ 29: వేసవి సెలవులు ముగింపు అనంతరం జూలై 8నుంచి ఎస్కేయూలో తరగతులు పునఃప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి శనివారం ప్రకటనలో తెలిపారు. జూలై 1నుంచి బోధన, బోధనేతర ఉద్యోగులు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నీటి సరఫరాలో సమస్యలు తలెత్తడంతో తరగతుల ప్రారంభానికి ఆలస్యమవుతోందన్నారు.

నేడు రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29: రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్ పోటీలు ఆదివారం విశాఖపట్నంలోని పోలీస్ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. రాయలసీమ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. వివరాలకు సెల్ నంబరు 8074106154, 7386355741లను సంప్రదించాలని కోరారు.

టమోటా మార్కెట్ ప్రారంభం



తెరుచుకున్న మండీలు

అనంతపురం రూరల్, జూన్ 29: కక్కలపల్లి క్రాస్‌లోని టమోటా మార్కెట్ ప్రారంభమైంది. టమోటా సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌లోని మండీల నిర్వాహకులు మండీలను సిద్ధం చేశారు. పంట చేతికొచ్చే సమయం దగ్గర పడుతుండటంతో అమ్మకాలకు ఏర్పాట్లు చేపట్టారు. మార్కెట్‌లో 20కిపైగా మండీలున్నాయి. ఇందులో ఇప్పటికే పలు మండీలు ఇటీవల ప్రారంభించారు. మరికొన్నింటిలో చిన్న చిన్న మరమ్మత్తుల పనులు చేపడుతున్నారు. శనవారం రెండు మూడు మండీలకు 50నుంచి 100బాక్సుల వరకు టమోటా రావడం జరిగింది. వారం పదిరోజుల్లో మార్కెట్‌లో టమోటా సందడి పెరగనుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ధర్మవరంరూరల్(కనగానపల్లి), జూన్29: మండలంలోని కొండపల్లి గ్రామసమీపంలో శనివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కనగానపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కంబదూరు మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన పవన్‌కుమార్(31) తన ద్విచక్రవాహనంలో కంబదూరు నుంచి అనంతపురం వెళ్తున్నాడు. మండలంలోని కొండపల్లి వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనున్న రాళ్లకుప్పలమీద పవన్‌కుమార్ ఎగిసిపడ్డాడు. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు కనగానపల్లి పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు బోరు వాహనం డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. అతనికి భార్య వాణి ఉంది.





మృతిచెందిన పవన్‌కుమార్, ఎగసిపడిన ద్విచక్రవాహనం

అనంతలో ఎన్నికల వ్యయ పరిశీలకులు

అనంతపురం టౌన్, జూన్29 : సార్వత్రిక పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఖర్చుల వివరాలను తేల్చడానికి కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు శనివారం అనంతపురం చేరుకున్నారు. ఐఏఎస్ అధికారులు నితిన్ అగర్వాల్, రాందాస్ టి, కాలే, విలాస్ వి, షిండే డిల్లీనుంచి అనంతకు చేరుకున్నారు. వారికి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వసతి ఏర్పాటు చేసారు. కలెక్టర్ వినోద్ కుమార్ పరిశీలకులను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈపరిశీలకులు వారం రోజులు పాటు జిల్లాలోనే ఉంటారు. ఇటీవల జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులందరూ ఫైనల్ ఖర్చుల వివరాలను వారికి అందజేయాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి తుది నివేదిక ఇవ్వనున్నారు.



ఎన్నికల వ్యయ పరిశీలకుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్

అక్రమంగా విద్యుత్ వాడితే కేసులు నమోదు : ఎస్ఈ



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్ఈ

అనంతపురంరూరల్, జూన్29: అక్రమంగా విద్యుత్ వాడితే కఠిన చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలోని గెస్ట్ హౌస్‌లో అనంతపురం డివిజన్ విజిలెన్స్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,380 అక్రమ విద్యుత్ కేసులు నమోదు చేసి రూ.6.66కోట్లు జరిమానా రూపంలో విధించామన్నారు. ఈ ఆర్థిక సంత్సరం ఏప్రిల్, మే నెలల్లో 1225 కేసులు నమోదు చేయడంతోపాటు రూ.90లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యుత్ అక్రమ వాడకదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానాలు విధించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో వ్యవసాయానికి కేటాయించిన నీటిని వాడుతున్నారన్నారు. అంతకు ముందు కదిరి డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేయించారు. ఈకార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ గోపి, డీఈఈ నాగేంద్ర, ఏఈఈ వీరా పాల్గొన్నారు.

అన్నదాతకు బ్యాంకుల నోటీసులు

- లోక్‌అదాలత్‌కు హాజరైన రైతులు
- రుణంలో 10 శాతం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలి : ఏపీ రైతు సంఘం వినతి



జిల్లా కోర్టు వద్ద బాధిత రైతులతో రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 29 : పంట రుణం చెల్లించలేదన్న కారణంతో వందలాది మంది రైతులకు బ్యాంకర్లు కోర్టు ద్వారా నోటీసులు జారీ చేశారు. శనివారం జిల్లా కోర్టులోని లోక్‌అదాలత్‌కు ఆయా రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నల్లప్ప, చంద్రశేఖర్‌లు కోర్టుకు వద్దకు వెళ్లి రైతులను పరామర్శించారు. ఎస్‌బీఐ, కెనరా, ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ అధికారులు గత నాలుగు, ఐదేళ్ల నుంచి పంటరుణం చెల్లించలేదన్న కారణంతో రైతులు తీసుకున్న అసలుతోపాటు వడ్డీతో సహా డబ్బులు చెల్లించాలంటూ కోర్టు నోటీసులు జారీ చేశారన్నారు. ఒక్క కెనరా బ్యాంక్ అధికారులు 200 మంది రైతులకు నోటీసులు జారీ చేశారన్నారు. వైసీపీ పాలనలో అతివృష్టి, అనావృష్టిలతో పంటల దిగుబడులు రాలేదని, అలాగే పంటనష్టపోయిన రైతులకు పంటనష్టపరిహారం, ఇన్సూరెన్స్‌లు అందించకపోవడంతో రైతులు పంట రుణాలు రెన్యూవల్ చేసుకోలేకపోయారన్నారు. జిల్లాలో గత ఐదేళ్లల్లో వందలాది మంది రైతులు పంట సాగుకు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. రైతులు తీసుకున్న పంట రుణంలో 10 శాతం చెల్లిస్తే, మిగతా సొమ్మును మాఫీ చేసి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.



రైతు భరోసా కేంద్రం (ఫైల్)

రైతు భరోసా కేంద్రం పేరు మార్పు

- ఇక నుంచి రైతు సేవా కేంద్రం
- మాజీ సీఎం జగన్ ఫొటో తొలగింపు
- నూతన సీఎం చంద్రబాబునాయుడు ఫొటో ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ..

అనంతపురం అర్బన్, జూన్ 29 : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ఇదివరకు వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న కార్యకలాపాలను మార్పు చేశారు. ఈ మేరకు శనివారం ఏపీ ప్రభుత్వ వ్యవసాయ ప్రత్యేక కమిషనర్ నుంచి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 451 వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలు నడుస్తున్నాయి. ఇక నుంచి వీటిని రైతు సేవా కేంద్రంగా మారుస్తూ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఆర్బీకేల్లోని కియోస్కోలు, సాఫ్ట్‌వేర్ యాప్‌ల్లో చిత్రీకరించిన నవరత్నాలు, లోగోలోని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫొటోను తక్షమే తొలగించి, నూతన సీఎం నారా చంద్రబాబునాయుడు ఫొటో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

వ్యవసాయ సలహా బోర్డులు రద్దు

జిల్లా వ్యవసాయ సలహా బోర్డుతోపాటు మండల స్థాయి వ్యవసాయ సలహా బోర్డుల కమిటీలను వెంటనే రద్దు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్‌బీకే ఛానల్, స్టూడియో పేరును ఇక నుంచి పాడి పంటల ఛానల్‌గా మార్చారు. వైఎస్ఆర్ రైతు భరోసా మాస పత్రిక పేరును 'పాడి పంటలు ' గా పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, జూన్29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.19వేలు, కనిష్టంగా రూ.8వేలు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 305 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నవోదయ ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ ఛైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసినిలతోపాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎస్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ అభినందించారు.



సాత్విక | మహిత | యుగంధర్ | యశ్వంత్ | లక్ష్మీనారాయణ

లోక్ అదాలత్‌లో 4,254 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం,జూన్ 29 : జాతీయ లోక్‌అదాలత్‌లో 4,254 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. శనివారం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టుల్లో మొత్తం 26 బెంచులు నిర్వహించారు. బాధిత ఫిర్యాదిదారులు రాజీకి సమ్మతించడంతో రాజీపడదగిన 707 క్రిమినల్ కేసులు, 69 సివిల్ కేసులు, 26 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, 3,452 ప్రిలిటిగేషన్ కేసులకు పరిష్కారం దక్కాయి. ఈ లోక్ అదాలత్‌లో ప్రమాద భరిత కేసులలో కక్షిదారులకు రూ.1,97,80,000 పరిహారం ఇప్పించడానికి రాజీమార్గం కుదిర్చారు. సివిల్ కేసుల్లో రూ.56,63,000 పైగా, ప్రిలిటిగేషన్ కేసులలో రూ.33,32,871 కక్షిదారుల మధ్య రాజీ ప్రకారం ఇప్పించారు. లోక్ అదాలత్ నిర్వహణను జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు సత్యవాణి, కార్యదర్శి ప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు.

గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్29 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న హిజ్రాలు గుర్తింపు కార్డు, ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్ శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. http://transgender.dosje.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకొని గుర్తింపు కార్డులు, ధృవపత్రాలను పొందాలన్నారు. వివరాలకు 08554-232380 నెంబర్‌ను సంప్రదించి సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు.

ఫైనల్‌కు అనంత, హైదరాబాద్ జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29: వెటరన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, హైదరాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో వెటరన్ క్రికెట్ సెమీస్ పోటీలు జరిగాయి. అనంతపురం, గుంటూరు జట్లు పోటీ పడగా...మొదట బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 13.5ఓవర్లలో 67పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం 11.3ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 68పరుగులు చేసి 7వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్ నెల్లూరు, హైదరాబాద్ జట్ల మధ్య జరగగా...మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 170పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 16ఓవర్లలో 60పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. దీంతో సెమీస్ లో విజయం సాధించిన అనంతపురం, హైదరాబాద్ జట్లు ఫైనల్‌కు దూసుకెళ్ళాయి. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు.



ఫైనల్‌కు చేరిన అనంతపురం జట్టు



అగ్రిమెంట్‌ను చూపుతున్న కళాశాల యాజమాన్యం

గుత్తిలో డ్రోన్ తయారీ కేంద్రం

గుత్తి జూన్29: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో త్వరలో డ్రోన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. చెన్నైకు చెందిన డ్రోన్ తయారీ సంస్థ 'గరుడా ఏరోస్పేస్' సౌజన్యంతో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఎంఓయూ అగ్రిమెంట్లపై సంతకాలు పూర్తయినట్లు ఆయన తెలిపారు. యూనిట్ ప్రారంభించడానికి వారికి స్థల సముదాయాన్ని కల్పిస్తున్నామన్నారు. యూనిట్ ద్వారా రైతులకు సంబంధించిన వివిధ రకాల డ్రోన్‌లు తయారీ చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. తమ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సు చదువుతున్న విద్యార్థులు గరుడా ఏరోస్పేస్ సంస్థద్వారా డ్రోన్‌ల తయారీ శిక్షణ, ఇంటర్‌షిప్, డ్రోన్ సర్వీసులు చేపట్టే అవకాశం పొందుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ అధికారి నందిని, ఇంతియాజ్, తన్వీర్, తదితరులుపాల్గొన్నారు.

చీనీచెట్ల నరికివేత

కొత్తచెరువు, జూన్ 29: మండలంలోని మైలసముద్రం గ్రామంలో కొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలకు చెందిన చీనీచెట్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేయడంతో పాటు డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రాజారమేశ్ నరికివేతకు గురైన చెట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డి సాగు చేసిన 160 చీనీచెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

మెడికల్ షాపుల తనిఖీ

బత్తలపల్లి, జూన్ 29: మండలకేంద్రంలోని మెడికల్ షాపులను శనివారం డ్రగ్ కంట్రోలర్ రమేష్ రెడ్డి తనిఖీ చేశారు. అన్ని మెడికల్ షాపులను తనిఖీ చేయాల్సిన ఆ అధికారి కేవలం అనంతపురం రోడ్డులోని ఒక మెడికల్ షాపును మాత్రమే తనిఖీ చేశారు. మరోషాపు యజమానిని అక్కడికే పిలిపించి కాలం చెల్లిన మందులు అమ్మినా, వైద్యుడి ప్రిస్కిప్షన్ లేకుండా మందులు ఇచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఐటీయూ పట్టణ కమిటీ ఏర్పాటు

కదిరిఅర్బన్, జూన్ 29: పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం సీఐటీయూ పట్టణ మహాసభ ను నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఐటీయూ అన్నిరంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి, లేబర్ కోడ్ పేరుతో కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. కార్మికులు సంఘటితమై హక్కులకోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్ గా జగన్మోహన్, కో కన్వీనర్లుగా రామమోహన్, ముస్తాక్, మాబునీసాతో పాటు మరికొంత మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

నంబులపూలకుంట, జూన్ 29: మండలంలోని పల్లెనివారిపల్లికి చెందిన విద్యార్థి నితిన్ ఆచూకీ లభ్యమైనట్లు తండ్రి చంద్రమోహన్ తెలిపారు. విద్యార్థి అదృశ్యంపై గత శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిని బంధువులు, మిత్రులు సోషల్‌మీడియాలో షేర్ చేశారు. కాగా శనివారం తిరుమల కొండపైన ఉన్న ఈ విద్యార్థిని కొందరు గుర్తించి పట్టుకున్నారు. తర్వాత తండ్రి చంద్రమోహన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే బంధువులు అక్కడికి చేరుకుని నితిన్ ఇంటికి తీసుకొస్తున్నట్లు చెప్పారు.

విద్యా సామగ్రి పంపిణీ

ముదిగుబ్బ,జూన్29: మండలంలోని గుడ్డంపల్లి తండాకు చెందిన న్యాయవాది చత్రేనాయక్ శనివారం అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు ఇతర విద్యాసామగ్రి ని వితరణ చేశారు. ఆయనకు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గణాంకాల దినోత్సవం

ధర్మవరం, జూన్ 29: పట్టణంలోని శ్రీసాయిడిగ్రీ కళాశాలలో శనివారం గణాంకాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ చాంద్‌బాషా, ప్రిన్సిపాల్ ఫణికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు కేక్‌కట్ చేశారు. అనంతరం గణాంక శాస్త్రం యొక్క ప్రాముఖ్యత గురించి అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా కుళ్లాయప్ప

ముదిగుబ్బ, జూన్ 29: మండలంలోని మద్దన్నగారిపల్లి గ్రామానికి చెందిన బిల్లు కుళ్లాయప్ప యాదవ్ బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటనలో తెలిపారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడి నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఓబుళదేవరచెరువు, జూన్ 29: మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మా మెడికల్ షాపు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పుట్టపర్తికి చెందిన విజన్ ఐకేర్ ఆస్పత్రికి చెందిన వైద్యుడు బొగ్గు సురేష్ పలువురికి కంటి పరీక్షలు చేశారు. సుమారు 133మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. 26మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. శిబిరంలో వైద్య సిబ్బంది సుధాకర్, రాజేష్, అనిత, అమృతవర్షిణి, నాగమణి, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, టైలరింగ్‌పై శిక్షణ

ఓబుళదేవరచెరువు, జూన్ 29: మండలకేంద్రంలో ఏకల్ గ్రామోత్థాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్, టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఐవీడీ (ఇంటిగ్రేడ్ విలేజ్ డెవలప్‌మెంట్) సెంటర్ అధ్యక్షుడు పిట్టా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉచితంగా శిక్షణ పొందాలనుకునే వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సెంటర్ కోఆర్డినేటర్ శ్రీరాములు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహస్వామి ఉత్సవాలు

మడకశిర రూరల్, జూన్ 29 : మండలపరిధిలోని చందకచర్ల గ్రామంలో నరసింహస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కర్ణాటక నుంచి శనివారం సాయంత్రం నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గ్రా మస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చు కున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అతివేగం ప్రమాదకరం

కదిరిలీగల్, జూన్ 29: వాహనాలు అతివేగంగా నడపడం ప్రమాదకరమని మండల న్యాయధికార సేవా సంస్థ చైరపర్సన్, న్యాయాధికారి ఎస్. జయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో ఓర్పు, సహనంతో ఉండాలన్నారు. ఏమాత్రం పొరపాటు జరిగినా పరిణామాలు దారుణంగా ఉంటాయన్నారు. లోక్ అదాలత్‌ద్వారా కేసుల సత్వర పరిష్కారం అవుతాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయాధికారులు ప్రతిమ, మీనాక్షి సుందరి, న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, ఏజీపీవీపీ శివప్రసాద్, సీఐలు పుల్లయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

పింఛన్లను సజావుగా పంపిణీ చేయాలి: డీఈఓ

నల్లమాడ, జూన్ 29: జూలై 1వ తేదీ సోమవారం ప్రభుత్వం చేపట్టనున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని మండలంలోని అన్ని గ్రామాల్లో సజావుగా నిర్వహించాలని మండల స్పెషలాఫీసర్ (డీఈఓ) మీనాక్షి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆమె మండల అధికారులతో సమీక్షించారు. మండలంలో 7,222మంది పింఛన్ దారులున్నారని, వారికి రూ.5కోట్ల 5లక్షల 54వేలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 1, 2వ తేదీల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించాలన్నారు. ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ అదేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహమ్మద్‌దౌలా, ఎంఈఓ సురేష్‌బాబు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండల వ్యాప్తంగా జూలై ఒకటో తేదీన ప్రభుత్వం చేపడుతున్న పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని తహసీల్దార్ నరేంద్రకుమార్ సూచించారు. అధికారుల సూచనల మేరకు పింఛన్లు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా సోమవారం పింఛన్లు సజావుగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ రామనాయక్ సిబ్బందికి ప్రకటనలో సూచించారు. మండలంలో 4,330 మందికి రూ. 2కోట్ల 91లక్షల 15వేల 5వందలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 1, 2వ తేదీల్లో పంపిణీ చేయడానికి సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

తాడిమర్రి: మండలంలోని 6166 మంది పింఛన్ దారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు 4 కోట్ల 15లక్షల 21వేల రుపాయలు నిధులు మంజూరైనట్టు ఎంపీడీఓ మణిమంజరి తెలిపారు. వీటిని 1, 2వ తేదీల్లో లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి అందజేస్తామని చెప్పారు.



నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఈఓ

ధర్మవరం: పట్టణంలో సచివాలయసిబ్బంది జూలై 1వ తేదీన పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని 39 వార్డు సచివాలయాల పరిధిలో 18,502 మంది పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. పంపిణీ రెండు రోజులపాటు జరుగుతుందని తెలిపారు.

పుట్టపర్తిరూరల్: మండంలోని అన్ని సచివాలయాల పరిధిలోని పింఛన్‌దారులకు సోమవారం ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పది సచివాలయాల పరిధిలో 4815 మంది ఫించన్‌దారులకు రూ. 3,07,81,450 పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇళ్ల వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి అందచేయనున్నారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

లింగవివక్షను నిర్మూలిద్దాం: డిప్యూటీ డీఎంహెచ్ఓ

ధర్మవరం, జూన్ 29: లింగ వివక్షత నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటు పడాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మాన్ సూచించారు. పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో శనివారం పీసీఅండ్ పీఎన్‌డీటీపై సమావేశం జరిగింది. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... ధర్మవరం సబ్ డివిజన్‌లో 11 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. వాటిల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు, ప్రైవేటు ఆస్పత్రుల్లో 9 ఉన్నాయన్నారు. ఈ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేయడం, ఆడపిల్లలు అయితే అబార్షన్లు చేయడం వంటివి చట్ట వ్యతి రేకమన్నారు. అలా చేసే వారిని చట్టపరంగా శిక్షిస్తామన్నారు. లింగ వివక్షత నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారి బాబాఫక్రుద్దీన్ ,టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, గైనకాలజిస్టు శైలజ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహా, అన్నమయ్యసేవామండలి అధ్యక్షుడు పోరాళ్లపుల్లయ్య, అయ్యప్పసేవా సమితి సభ్యుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎం హెచ్ఓ సెల్వియాసాల్మాన్

కస్తూర్బా పాఠశాల తనిఖీ

నల్లమాడ, జూన్ 29: మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఎంఈఓ సురేష్ బాబు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విధులు సక్రంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత తరగతి గదులలో కెళ్లి విద్యార్థినులతో పాఠ్యాంశాలలోని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తర్వాత సమస్యలపై ఆరా తీశారు. సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.



విద్యార్థినిని ప్రశ్నలు అడుగుతున్న ఎంఈఓ

న్యాయవాదికి ఎమ్మెల్యే కందికుంట పరామర్శ

కదిరి, జూన్ 29: పట్టణంలో గత శుక్రవారం జరిగి దాడి ఘటనలో బాధితుడైన న్యాయవాది రామస్వామిని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం ఇంటికెళ్లి పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీసి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. దౌర్జన్య కర సంఘటనలను భరించేదిలేదన్నారు. న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా మనుగడ సాగించాలేకానీ, దౌర్జన్యాలతో సమస్య పరిష్కారం కాదన్నారు. న్యాయవాదులు కూడా సమాజానికి ఉపయోగపడేలా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట న్యాయవాదులు నాగేంద్రరెడ్డి, కృష్ణమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, చౌడప్ప, రమేష్, సురేంద్ర ఉన్నారు.



న్యాయవాది రామస్వామిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

మాపై కేసులు సరికాదు

బీజేపీ నాయకుడు గంగాధర్

కదిరి, జూన్ 29: పట్టణంలో ఇద్దరు న్యాయవాదులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తలుపుల గంగాధర్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. న్యాయవాదులు రామస్వామి, వరప్రసాద్ తమకు సమస్యతో కూడిన భూములను అగ్రిమెంటు చేశారన్నారు. భూమి వద్దకు వెళితే అక్కడ సైదాపురం వ్యక్తులు అడ్డు తగులుతున్నారన్నారు. భూమిని సవరించి ఇవ్వాలని, లేకపోతే డబ్బులు వెనక్కి ఇవ్వాలని అనేకమార్లు కోరామన్నారు. అగ్రిమెంటుకు సంబంధించి న్యాయవాదులిద్దరు ఇంటివద్దకు రమ్మంటేనే వెళ్లామన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తనను కేసుల్లో ఇరికించడం ఎంతవరకు సమంజసన్నారు. సమస్య పరిష్కరించమంటే తనను క్రిమినల్ కేసులో నిందితునిగా చేర్చడమం ఏమిటన్నారు. డబ్బులిచ్చి వారిద్దరిచేతిలో తాను మోసపోయానని ఆయన పేర్కొన్నారు. అందుకే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

జామియా మసీదు కమిటీ ఎన్నిక

బుక్కపట్నం, జూన్ 29: మండలకేంద్రంలోని జామియా మసీదు నూతన కమిటీని ముస్లిం పెద్దలు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముతవల్లిగా ఆకుతోట సయ్యద్‌బాషా, ప్రెసిడెంట్‌గా స్టూడియో ఫక్రుద్దీన్‌ను ఎన్నుకున్నారు. మసీదులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నిక చేశారు. సెక్రెటరీలుగా మహబూబ్‌బాషా, సాధక్‌బాషా, సలహాదారులుగా జబార్, ఆకుతోట షామీర్‌బాషాతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పీజీ సెట్‌లో హరిత ప్రతిభ

ఓబుళదేవరచెరువు, జూన్ 29: మండలంలోని తుమ్మకుంట్లపల్లి గ్రామానికి చెందిన పచ్చర్ల హరిత ఏపీ పీజీసెట్‌లో ప్రతిభ కనబరిచింది. పీజీ సెట్ సైకాలజీలో 146వ ర్యాంకు సాధించినట్లు తల్లిదండ్రులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు, పార్వతి శనివారం తెలిపారు. ఈనెల 13వ తేదీన వెలువడిన పీజీ ఎంట్రెన్స్ ఫలితాల్లో ఈవిద్యార్థిని ర్యాంక్ సాధించినట్లు చెప్పారు.



ర్యాంక్ సాధించిన హరిత

రిటైర్డ్ ఐసీడీఎస్ పీడీకి సన్మానం

కొత్తచెరువు, జూన్ 29: శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పదవీ విరమణ కార్యక్రమాన్ని పుట్టపర్తిలోని ఓ పంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించారు. కంబదూరు, మడకశిర సీడీపీఓలు వనజాఅక్కమ్మ, నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కర్నూలు ఆర్జేడీ రోహిణి పాల్గొని ఆమెను పూల మాల, శాలువాతో సన్మానించారు. అలాగే సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు సన్మానం చేశారు.

రిటైర్డ్ ఉద్యోగికి జేసీ సన్మానం

పుట్టపర్తి: పట్టణంలోని కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేసిన రామాంజనేయరెడ్డి పదవీ విరమణ పొందారు. ఇందుకు ఆయన్ను శనివారం కలెక్టరేట్‌లోనే జేసీ అభిషేక్ కుమారత్‌తో పాటు ఉద్యోగులు పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మూడో రోజూ కొనసాగిన హాకీ టోర్నీ



తలపడుతున్న విశాఖపట్నం ,కృష్ణా జిల్లాల జట్లు

ధర్మవరం, జూన్ 29: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మూడో రోజైన శనివారం కూడా 14వ అంతర్‌జిల్లాల సీనియర్ బాలుర హాకీ టోర్నీని నిర్వహించారు. ఇందులో 9 జట్లు పాల్గొన్నాయి. అందులో శ్రీసత్యసాయి, విశాఖపట్నం, తిరుపతి, ఎన్టీఆర్ జిల్లాల జట్లు విజయం సెమీఫైనల్‌కు చేరుకున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బందనాదం సూర్యప్రకాశ్ తెలిపారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ సీఈఓ నిరంజన్‌రెడ్డి, కోశాధికారి థామస్ పీటర్, సత్యసాయిజిల్లా హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అరవిందగౌడ్, ఉపాధ్యక్షులు, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలకు పాముకాటు

గోరంట్ల, జూన్ 29: మండలంలోని గొల్లపల్లి, సింగిరెడ్డిపల్లిల్లో శనివారం పాముకాటుకు గురై ఇద్దరు మహిళలు అస్వస్థత పొందారు. గొల్లపల్లికి చెందిన రామక్రిష్ణ భార్య గౌరమ్మ పొలంలో పనిచేస్తుండగా, ఎడమచేతి వేలిపై నాగుపాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అనంతరం పుట్టపర్తికి తరలించారు. అలాగే సింగిరెడ్డిపల్లికి చెందిన సుబ్బిరెడ్డి భార్య సంజమ్మ పశువులకోసం వామిలో గ్రాసం తీసుకురావడానికి వెళ్లగా ఎడమకాలిపై పాము కాటువేసింది. ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

లోక్ అదాలత్‌లో 116 కేసులు పరిష్కారం

పుట్టపర్తిరూరల్, జూన్ 29: రాజీకాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని సివిల్ కోర్టులో శనివారం జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ అధ్యక్షతన లోక్ అదాలత్ జరిగింది. ఇందులో 105 చెక్‌బౌన్సు కేసులు, బ్యాంకు రుణాలకు సంబందించిన 4 కేసులు, 2 మద్యం కేసులు, 2 మనీసూట్‌కు సంబందించిన కేసులు, 3 ఈపీ కేసులు కలిసి మొత్తం 116 కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యాయి. అనంతరం న్యాయాధికారి మాట్లాడుతూ రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిస్కార వేదికని తెలిపారు. కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, లెక్కల యదుభూషణ్, ఇందిర, ప్రసాద్, శ్రీనివాసులు, లోక్ అదాలత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

109కేసులు పరిష్కారం

ధర్మవరంరూరల్: పట్టణంలోని కోర్టులో జాతీయ మెగా లోక్‌ఆదాలత్ సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి, జూనియర్‌సివిల్ న్యాయాధికారి రమ్యసాయి, సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ అవధాని మురళీ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో కక్షిదారులను పిలిపించి న్యాయం చేసి కేసులను సత్వరమే పరిష్కరించారు. 109కేసులు పరిష్కారమైనట్లు న్యాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి రాకేష్



ధర్మవరంలోని లోక్ అదాలత్‌లో కక్షిదారులను రాజీ చేస్తున్న న్యాయాధికారులు

పింఛన్ పెంపు అభినందనీయం : టీడీపీ

ముదిగుబ్బ,జూన్29: సీఎం చంద్రబాబు పేదలకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని పెంచడం అభినందనీయమని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి చంద్రబాబు పింఛన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారన్నారు. జూలై 1వ తేదీన జరిగే పింఛన్ పంపిణీలో కూటమి నాయకులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి రమేష్‌బాబు, టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, కిష్టయ్య, భైరవ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం: ప్రజల ఆకాంక్షలను నేరవేర్చడమే కూటమి ప్రభుత్వ కర్తవ్యమని టీడీపీ మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా జూలై 1వతేదీన లబ్ధిదారులకు పింఛన్ మొత్వాన్ని పెంచి ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులని సూచించారు.

అధికారుల పనితీరు బాగలేదు

● కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం

పుట్టపర్తి, జూన్ 29: పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టడం, తాగునీటి సమస్య తీర్చడం, వీధి లైట్లు ఏర్పాటు చేయడం వంటి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ కౌన్సిలర్లు మండిపడ్డారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో పనులు చేయడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని వైసీపీ,టీడీపీ కౌన్సిలర్‌లుసూర్యాగౌడ్, భాస్కర్‌రెడ్డి, రత్నప్పచౌదరి, లక్ష్మీపతి నిలదీశారు. మా వార్డులలో సమస్యలు పరిష్కరించరు కానీ.. కలెక్టరేట్ కార్యాలయ హంగులకు మాత్రం నిధుల ఎలా ఖర్చుచేస్తారంటూ ప్రశ్నించారు. కనీసం వీధిలైట్లు కూడా వేయడం లేదంటూ మరో కౌన్సిలర్ వెంకటరమణమ్మ మండిపడ్డారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ఓడిపోయిందని చైర్మన్ పదవికి వెంటనే రాజీనామా చేయాలంటూ టీడీపీ ఫ్లోర్ లీడర్ రత్నప్పచౌదరి డిమాండ్ చేశారు. ఈ ఓటమే మీ పరిపాలనలో వైఫల్యానికి నిదర్శనమన్నారు. పరిపాలన సజావుగా సాగేందుకు కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటామని అందుకు సభ్యులందరూసహకరించాలని కోరారు. సమావేశంలో వైస్‌చైర్మన్‌లు తిప్పన్న, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులపై ఆగ్రహిస్తున్న టీడీపీ కౌన్సిలర్ రత్నప్ప చౌదరి

వైద్యుల నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

● ఆస్పత్రి వద్ద మృతురాలి కుమారుల ఆందోళన

కదిరిఅర్బన్, జూన్ 29: వైద్యుల నిర్లక్ష్యంతోనే మా అమ్మ ప్రాణం పోయిందని ఆమె కుమారులు శనివారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక వాణి వీధికి చెందిన తాము మా అమ్మ సుశీలమ్మ (55)కు కాలికి గాయం కావడంతో ఈనెల 18వ తేదీన ఇక్కడే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లామన్నారు. కాగా అదేరోజు రాత్రి ఆమెకు నొప్పి, మంట ఎక్కువ కావడంతో ప్రభుత్వాస్పత్రికి రాత్రి 9గంటల సమయంలో తీసుకొచ్చామన్నారు. అక్కడ విధుల్లో ఉన్న ఓ వైద్యురాలు ఇంజక్షన్ వేసి జనరల్ వార్డుకు తరలించారని, ఆ తర్వాత రాత్రంతా మంట, నొప్పితో బాధపడుతున్నా.. వైద్యులు కానీ, నర్సులు కానీ పట్టించుకోలేదని వాపోయారు. ఉదయానికి గాయం మరింత పెద్దదై నొప్పి తీవ్రమైందని, 19న ఉదయం 10గంటలకు మరో వైద్యుడు వచ్చి పరీక్షించి, ఇది సెల్యులైటిస్ వ్యాధి అని, పరిస్థితి విషమంగా ఉందని చెప్పి చికిత్స ప్రారంభించేం దుకు ఏర్పాట్లు మొదలు పెట్టారని అన్నారు. అయితే అంతలోపే తమ తల్లి మృతి చెందిందన్నారు. సకాలంలో వైద్యులు, సిబ్బంది స్పందించి ఉంటే ఆమె బతికేదని కుమారులు సాంబశివ, వెంకటేశ్వర్లు కంటతడిపెట్టారు. ఘటన జరిగిన రోజే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై సూపరిటెండెంట్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులైన వైద్యులు, వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ దృష్టికి తీసుకెళ్లిగా, మృతురాలి కుటుంబ సభ్యులనుంచి ఫిర్యాదు అందిందని, ఆ రోజు విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందిపై విచారణ చేపట్టామని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలలు చర్యలు తీసుకుంటామని అన్నారు.



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

చేనేత సమస్యలను పరిష్కరించండి

ధర్మవరం, జూన్ 29: చేనేత సమస్యలను పరిష్కరించాలని ధర్మవరానికి చెందిన చేనేత ప్రముఖులు బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితను కోరారు. పెనుకొండలో శనివారం వారు మంత్రిని కలిసి పలు చేనేత సమస్యలపై విన్నవించారు. ఇందుకు స్పందించిన మంత్రి మాట్లాడుతూ.. ధర్మవరం చేనేతపరిశ్రమను తప్పకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



మంత్రి సవితను కలిసిన ధర్మవరం చేనేత ప్రముఖులు

ఇళ్ల స్థలాలు ఇప్పించాలని వినతి

ధర్మవరం, జూన్ 29: తమకు ఇంటి స్థలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని ఆటో యూనియన్ నాయకులు శనివారం జనసేన ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణంలోని దాదాపు 400 మంది ఆటో కార్మికులు అద్దె ఇళ్లల్లో ఉంటూ చాలీచాలని సంపాదనతో కాలం నెట్టుకొస్తున్నారన్నారు. ఇంటిస్థలాలు ఇప్పించేలా చూడాలని విన్నవించారు. స్పందించిన చిలకం మధు మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి ఆయన సహకారంతో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్, ట్రాన్స్‌పోర్ట్‌రంగం రాష్ట్రనాయకులు రఫి, రవి, జిలాన్, రియాజ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



చిలకం మధుకు వినతిపత్రం ఇస్తున్న ఆటో యూనియన్ నాయకులు

వంతెనను బాగు చేయించాలని వినతి

ముదిగుబ్బ,జూన్29: కొన్నేళ్ల కిందట వర్షాలకు కొడవండ్లపల్లి సమీపంలో ఉన్న మద్దిలేరు వంతెన దెబ్బతిందని, దానిని బాగు చేయించాలని కోరుతూ ఆ గ్రామస్థులు శనివారం మండలకేంద్రంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గతంలో వచ్చిన వరద ఉధృతి వలన వంతెన కుప్పకూలిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ తాత్కాలికంగా మట్టి వేసి చేతులు దులిపేకున్నారన్నారు. వర్షాలు ఎక్కువగా పడితే రాకపోకలకు ఇబ్బంది అవుతోందన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి వచ్చిన వెంటనే సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

'నేను బడికిపోతా' ర్యాలీ

ఓబుళదేవరచెరువు, జూన్ 29: మండలంలోని గౌనిపల్లి గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నపాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నేను బడికిపోతా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. పురవీధుల గుండా ర్యాలీ సాగింది. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా నరసింహస్వామి ఉత్సవాలు



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్థులు

మడకశిర రూరల్, జూన్ 29 : మండలపరిధిలోని చందకచర్ల గ్రామంలో నరసింహస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కర్ణాటక నుంచి శనివారం సాయంత్రం నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పిల్లలను బడిలో చేర్చండి

తహసీల్దార్

మడకశిర రూరల్, జూన్ 29 : బడిమానివేసిన విద్యార్థులందరిని పాఠశాలలో తప్పని సరిగా చేర్పించాలని తహసీల్దార్ వెంకటేశులు తెలిపారు. మండలంలోని ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రతి గ్రామంలో పర్యటించి బడిమానివేసిన విద్యార్థులను గుర్తించి వారిని మళ్లీ బడిలో చేర్పించాలని ఆదేశించారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు, ఎంఈఓలు భాస్కర్, నరసంహులు ఉన్నారు.

విద్యాభివృద్ధిపై ఉపాధ్యాయులకు శిక్షణ

గోరంట్ల, జూన్ 29: పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో విద్యాప్రవేశికలు, స్వీకాన్ యాప్ గురించి, విద్యార్థులకు పంపిణీచే సే యూనిఫాం, బూట్లు, కిట్ల పంపిణీపై ఉపాధ్యాయులకు ఎంఈఓలు జాన్‌రెడ్డెప్ప, గోపాల్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్, గత నాలుగేళ్లల్లో ప్రవేశాల తగ్గుదలకు కారణాలు, పెరుగుదలకు తీసుకోవాల్సిన విధానంపై శిక్షణ ఇచ్చారు. నూతనంగా ఈ సంవత్సరం చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించారు.

2న కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం

అగళి, జూన్ 29 : మడకశిరలో కోల్డ్ స్టోరేజ్‌లో జూలై 2న జరిగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ లోకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజకుమార్, శనివారం తెలిపారు. అగళి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని వారుకోరారు.

అనారోగ్యంతో ఐటీడీపీ కార్యకర్త మృతి

చిలమత్తూరు, జూన్ 29: మండలంలో ఐటీడీపీ కార్యకర్తగా పనిచేస్తున్న చాకలి నాగరాజు (37) శుక్రవారం రాత్రి ఆనారోగ్యంతో మృతి చెందాడు. ఆటో నడుపుతూ జీవనం చేసుకుంటూనే టీడీపీలో చురుకైన కార్యకర్తగా పనిచేశాడు. అతడు కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యానికి గురై బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందు తూ శుక్రవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి భార్య రెండేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి అతడు వారి తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలియగానే ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ బాలాజీ, టీడీపీ నాయకులు నందీషప్ప, అశ్వర్థప్ప, నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, విశ్వనాథరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

హిందూపురం(పరిగి), జూన్ 29: మండలంలోని శ్రీరంగరాజులపల్లి ఉన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా 6, 7, 8 తరగతి విద్యార్థులకు శారదమ్మ మహిళా మండలి అధ్యక్షురాలు ఆదినారాయణక్క, అనంతపురం స్టిచ్చింగ్ సెంటర్ వారి సౌజన్యంతో దుస్తులను గ్రామ పెద్దలు అందజేశారు. అనంతరం నేను బడికి పోతా ప్రాధాన్యతను ఉద్దేశించి గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు శివన్న, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

హిందూపురం(పరిగి), జూన్ 29 : బీజేపీ పరిగి మండలం కన్వీనర్ శనివారం కొడిగెనహళ్లి ప్రాథమిక, ఉర్దూ పాఠశాలలో చదువుతున్న 75మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యా ర్థులకు చదువు పరంగా ఏ సమస్య ఉన్నా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బజరంగల్ నవీన్, అఖిల్, సుదీర్, సాయి, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి: ఏడీ

మడకశిర రూరల్, జూన్ 29 : మల్బరీ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సెరికల్చర్ ఏడీ రాజు సూచించారు. ఆయన శనివారం మండలంలోని జమ్మానిపల్లి,తురుకువాండ్లపల్లి గ్రామాల రైతులకు మల్బరీ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మల్బరీ రైతులు అందరూ ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆ రెండు గ్రామాల ప్రజలు మాట్లాడుతూ... పంటలకు జింకల బెడద ఎక్కువగా ఉందిని, వాటిని అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఏడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలకు పాముకాటు

గోరంట్ల, జూన్ 29: మండలంలోని గొల్లపల్లి, సింగిరెడ్డిపల్లిల్లో శనివారం పాముకాటుకు గురై ఇద్దరు మహిళలు అస్వస్థత పొందారు. గొల్లపల్లికి చె ందిన రామక్రిష్ణ భార్య గౌరమ్మ పొలంలో పనిచేస్తుండగా, ఎడమచేతి వేలిపై నాగుపాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ఉషా చికిత్స అందించారు. అనంతరం ప్రయివేటు వాహనంలో పుట్టపర్తికి తరలించారు. అలాగే సింగిరెడ్డిపల్లికి చెందిన సుబ్బిరెడ్డి భార్య నంజమ్మ పశువులకోసం గడ్డివామిలో గ్రాసం తీసుకురావడానికి వెళ్లగా ఎడమకాలిపై పాము కాటువేసింది. ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

అధికారం ఉన్నప్పుడు వినిపించని గొంతు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇంద్రజ, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- ఇప్పుడు ప్రజా సమస్యలపై నోరెత్తిన వైసీపీ కౌన్సిలర్లు
- అభివృద్ధి కోసం సలహాలిస్తే స్వీకరిస్తాం : టీడీపీ
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

హిందూపురం, జూన్ 29 : మూడేళ్లపాటు అధికారంలో ఉన్న వైసీపీ సభ్యులు అభివృద్ధిపై ఏనాడూ నోరు మెదపలేదు. కానీ రాష్ట్రంలో పార్టీ అధికారం కోల్పోయాక ప్రజా సమస్యలు గుర్తుకొచ్చాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలపై వైసీపీ కౌన్సిలర్లు మాట్లాడారు. అయితే తమ వార్డుల్లో అభివృద్ధి జరగకపోవడంతో ప్రజలు నిలదీస్తున్నా వారు మూడేళ్లుగా మిన్నకుండిపోయారు. వారే ఈ సమావేశంలో అభివృద్ధి పనులపై మాట్లాడటంతో టీడీపీ కౌన్సిలర్లతో పాటు అధికారు కూడా ముక్కున వేలేసుకున్నారు. ఓటేసిన ప్రజలు తమను నిలదీస్తున్నారని, వైసీపీ కౌన్సిలర్లున్న వార్డులకు అధిక నిధులుకేటాయించాలని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నిధులు విరివిగా తీసుకొచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. పట్టణంలో 2017-18సంవత్సరాలకు సంబంధించి తాగునీరు సరఫరా చేసి నిధులు విడుదల చేయాలని వైసీపీ కౌన్సిలర్ శివ కోరారు. దీనిపై కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... వేసవిలోకాకుండా వర్షాకాలంలో తాగునీటికి సంబంధించిన నిధులు విడుదల చేయడం సబబు కాదన్నారు. ఐదారేళ్లుగా నిధులు అలాగే ఉన్నాయని, వాటికి సంబంధించి నివేదికలు పంపకపోతే అవి వెనక్కు వెళ్లే అవకాశం ఉందన్నారు. కావున కలెక్టర్ ఆదేశాలతో ఆ నిధులు కావాలని కోరుతామన్నారు. ఒకవేళ ఆ నిధులు వచ్చినా వాడుకునేందుకు వచ్చే వేసవిలోనే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మునిసిపల్ ప్రతిపక్షనేత రమేష్ మాట్లాడుతూ... అభివృద్ధి కోసం ప్రతి సభ్యుడు ఇచ్చే సలహాలను స్వీకరిస్తామని పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. నీటి ఎద్దడి నిధులకు సంబంధించి రూ.2.5కోట్లు వెనక్కు వెళ్లకుండా కమిషనర్ తీసుకున్న నిర్ణయం మంచిదేనన్నారు. అయితే ఇందులో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలన్నారు. పట్టణానికి రూ.66కోట్లు నిధులతోపాటు మరో రూ.20కోట్లు తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని ఇప్పటికే దీనికి సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను కోరినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా పరిగి బస్టాండులో నిర్మించిన రేకుల షెడ్లను తొలగించాలన్నారు. అక్కడ 18 దుకాణాలకు అనుమతి పొందిన వారు 26షెడ్లు ఏర్పాటు చేసుకోవడం సబబుకాదని టీడీపీ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వావాదం జరిగింది. అనంతరం పలు సమస్యలపై సభ్యులు మాట్లాడారు. ఎజెండాలోని అంశాలను ఆమోదించారు.

ఎంపీ పార్థసారథికి ఘన స్వాగతం



ఎంపీ పార్థసారథికి స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

చిలమత్తూరు, జూన్ 29: హిందూపురం ఎంపీ బీకే పార్థసారథికి శనివారం కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన పెనుకొండకు వస్తున్న సందర్భంగా కొడికొండ చెక్‌పోస్టులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయనను పూలమాలతో సత్కరించి ఎంపీగా విజయం సాధించినందుకు అభినందించారు. ఈ సందర్భంగా చిలమత్తూరులో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చిన్న ప్రవీణ్‌కుమార్, వెంకటరమణ, జయచంద్ర తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

పురం అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, జూన్ 29 : మెగా లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వరమే పరిష్కారం అవుతాయని స్థానిక అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. కక్షిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించు కుంటే ప్రశాంత జీవనం సాగించవచ్చన్నారు. ఈ సందర్భంగా రెండు బెంచీలు ఏర్పాటుచేసి ఒక బెంచీలో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ, రెండో బెంచ్‌లో జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి పాల్గొన్నా రు. మొత్తం 118కేసులు పరిష్కరించారు. ఇందులో 31 ఐపీసీ కేసులు, 28ఇసుక అ క్రమ రవాణా, 16గుట్కా, మూడు మద్యం రవాణా, 13 చెక్‌బౌన్స్ కేసులు , భర ణం ఒకటి, చిన్నపాటి తగాదాలకు సంబంధించిన 20కేసులను పరిష్కరించినట్లు న్యాయాధికారులు తెలిపారు. అలాగే వివిధ కేసులకు సంబంధించి బాధితులకు రూ.40,88,884 అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, లోక్ అదాలత్ సభ్యులు సంతోష్‌కుమారి, నవేర, నరసింహమూర్తి, ఈశ్వరప్ప, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో లో 81కేసుల పరిష్కారం

పెనుకొండ టౌన్: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 81 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్ర మంలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మడకశిరలో 76 కేసులు...

మడకశిరటౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 76 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. బ్యాంకుకు సంబంధించి ఒక కేసు పరిష్కారం కాగా రూ.1.92లక్షలు నగదు సెటిల్‌మెంట్ అయినట్లు తెలిపారు. అలాగే 24 క్రిమినల్ కేసులకు రూ.61వేలు, 35 ఎస్‌టీసీ కేసులకు రూ.37800 బాధితులకు చెల్లించినట్లు తెలిపారు. ఎక్సైజ్ కేసులు 15, ఒక ఎంసీ కేసురే రూ.37965 జరిమానా విధించినట్లు తెలిపారు. మొత్తం 76 కేసులు పరిష్కారం కాగా రూ.328765 ప్రభుత్వ ఆదాయానికి జమైనట్లు తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్ కార్యాక్రమంలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఆర్ అశోక్‌కుమార్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యుడిని నియమించాలి

రొళ్ల, జూన్ 29: మండలానికి పశువుల వైద్యుడు లేక పోవడంతో మూగజీవాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పశువులకు ఎలాంటి చిన్నపాటి రోగం వచ్చినా వైద్యం చేసుకోలేని స్థితిలో వాటిని కోల్పోవాల్సిన పరిస్థితి దాపురించిందని మండల ప్రజలు వాపోతున్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల తదితర మూగ జీవాలు రోగాలబారిన పడితే మందులు ఇచ్చే నాథుడు లేడని వాపోతున్నారు. అంతే కాకుండా బ్యాంకుల్లో పశువులు, గొర్రెలపై రుణాలు పొందిన వారికి ఇన్సూరెన్స్‌లు లాంటివి లేకపోవడంతో వెల వెల బోతున్నారు. పశువుల వైద్యుడిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చీనీచెట్ల నరికివేత

కొత్తచెరువు, జూన్ 29: మండలంలోని మైలసముద్రం గ్రామంలో కొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలకు చెందిన చీనీచెట్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేయడంతో పాటు డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రాజారమేశ్ నరికివేతకు గురైన చెట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొండారెడ్డి, ప్రతాప్ రెడ్డి సాగు చేసిన 160 చీనీచెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

అనుమతులు ఇప్పించండి

- లేదంటే తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వండి
- మున్సిపల్ చైర్‌పర్సన్‌ను నిలదీసిన వ్యాపారులు

హిందూపురం, జూన్ 29 : పట్టణంలోని పరిగి బస్టాండు ఆవరణంలో హోల్‌సేల్ వ్యాపారుల కోసం కేటాయించిన స్థలాన్ని ఖాళీ చేయాలని మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి వ్యాపారులకు నోటీసులు జారీచేశారు. ఈ విషయం తెలుసుకున్న హోల్‌సేల్ వ్యాపారులు శనివారం మునిసిపల్ చైర్‌పర్సన్ చాంబర్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజను కలిసి మాట్లాడుతూ... తమకు అనుమతులు మంజూరు చేయిస్తామని కొంత మంది పాలకపక్ష కౌన్సిలర్లు డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. అయితే తమకు ఇప్పుడు నోటీసులు ఇవ్వడంతో పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు అక్కడ అనుమతులైనా ఇప్పించాలని లేక డబ్బులైనా తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. అక్కడే ఉన్న మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం బహిరంగ వేలంలో స్థలాలు దక్కించుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. అలాకాకుండా స్థలాలు అప్పగించే ప్రసక్తేలేదన్నారు. దీనిపై వ్యాపారులు మాట్లాడుతూ గతంలో బహిరంగ వేలం నిర్వహించకుండా స్థలాలకు అనుమతులు ఇప్పిస్తామంటూ గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులతోపాటు కౌన్సిలర్లు కొంతమొత్తాన్ని తమ వద్ద నుంచి తీసుకున్నారన్నారు. ఇప్పుడేమో ఇలా అంటే ఎలా అని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులు ఇవ్వలేని పక్షంలో తమ నుంచి తీసుకున్న డబ్బు వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపైసాకు సంబంధించి ఆధారాలు ఉన్నాయన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయండి

రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్

గోరంట్ల, జూన్ 29: ప్రభుత్వం నిర్వహించనున్న మెగా డీఎస్సీలో ఉర్దూ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని బీసీ సంక్షేమం చేనేత, జౌళి శాఖల మంత్రి సవితను రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రుటా) వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్‌అహమ్మద్ కోరారు. మంత్రి సవితను శనివారం పెనుకొండ లోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో కలిసి వినతిపత్రం అందించినట్లు ఆయన విలేక రులకు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉన్నతపాఠశాలలు, మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో ఉర్దూమీడియం ఉపాధ్యాయులు లేక, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆమెకు వివరించామన్నారు. ఉర్దూ మాధ్యంలో డీఎడ్, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు వేల సంఖ్యలో డీఎస్సీకోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపామన్నా రు. మెగా డీఎస్సీలో ఎస్‌జీటీ, సూల్ అసిస్టెంట్ల అన్ని ఉర్దూ పోస్టులు డీ రిజర్వు చేసి, అన్ని పోస్టులను ఓపెన్ క్యాటగిరితో నింపాలని కోరారు. ఈవిషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని మంత్రిని కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. ఈకార్యక్రమంలో రుటా సభ్యులు సాధిక్‌వలి, మసీవుల్లా, యాక్బు, ఆర్పీ అలీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు



మంత్రి సవితను సత్కరిస్తున్న ప్రైవేటు పాఠశాలల యజమానులు

గోరంట్ల, జూన్ 29: మండలంలోని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితను శనివారం కలిశారు. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు గౌస్‌బాషా ఆధ్వర్యంలో శనివారం మంత్రిని పెనుకొండలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛమిచ్చి, అభినందనలు తెలిపారు. శాలువతో ఘనంగా ఆమెను సత్కరించినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, మండల కోశాధికారి లక్ష్మీపతి, రామమోహన్‌రెడ్డి, ప్రవీణ్, ఓబులరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

యాడికి, జూన్ 29: పొలంలో పనులకు వచ్చిన కూలీలకు మద్యం తాగించవద్దని చెప్పినా తన మాటలను పెడచెవిన పెట్టాడన్న మనస్తాపంతో పావని (33) అనే మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి బోయరెడ్డిపల్లి గ్రామ సమీపాన ఉన్న పెన్నాసిమెంట్స్ క్వార్టర్స్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు బనగానపల్లి గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మహేశ్వర్‌రెడ్డి బోయరెడ్డిపల్లి గ్రామసమీపంలో ఉన్న పొలాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేస్తున్నాడు. శుక్రవారం పొలం పనుల నిమిత్తం కూలీలు వచ్చారు. కూలీలకు పాయసం, అన్నం చేసుకొని వస్తాను వారికి మద్యం తాగించవద్దని భర్త మహేశ్వర్‌రెడ్డికి పావని తెలిపింది. భార్య మాటలను పెడచెవిన పెట్టిన భర్త కూలీలకు మద్యం తాగించాడు. తన మాటలను పెడచెవిన పెట్టడంతో పావని మనస్తాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పావని తల్లి ప్రభావతి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుకాణంలో చోరీ

యాడికి, జూన్ 29: వేములపాడు గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు కుళ్లాయప్ప తెలిపిన మేరకు జాతీయ రహదారి పక్కన కిరాణా దుకాణం నిర్వహించుకుంటున్నట్లు తెలిపాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దుకాణానికి ఉన్న రేకులను తొలగించి చోరీకి పాల్పడ్డారన్నారు. రూ.18వేలు విలువైన సిగరెట్ల బండిల్స్, సబ్బులు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.

రోడ్లపైకి చేరుతున్న మురుగు నీరు

మడకశిర రూరల్, జూన్ 29 : మండలంలోని సీ కోడిగేపల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్లకు ఒక వైపు మాత్రమే డ్రైనేజీ నిర్మించారని, అది కూడా చెత్తా చెదారంతో నిండి పోయిందన్నారు. దీంతో ఇళ్లలో నుంచి వచ్చే నీరు రోడ్లపైకి చేరి మురుగు గుంటలుగా మారాయని అంటున్నారు. పలు చోట్ల పూర్తిగా బురదమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి మురుగు నీరు రోడ్లపై చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



మురుగునీటితో బురద మయమైన ఎస్సీ కాలనీ రోడ్డు

ఇంటి వద్దే ఉండి పింఛన్ తీసుకోండి: కమిషనర్

పెనుకొండ, జూన్ 29: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగర పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులందరూ జూలై 1న సోమవారం ఇంటి వద్దనే ఉండి పింఛన్ తీసుకోవాలని కమిషనర్ వంశీకృష్ణ భార్గవ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య, వితంతువులు, దివ్యాంగులు తదితర పింఛన్‌దారులకు వార్డు సచివాలయ కార్యదర్శులు ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందజేస్తారన్నారు. ఉదయం 6గంటల నుంచే ఇంటి వద్దకు వచ్చి పంపిణీ డబ్బు పంపిణీ చేస్తారన్నారు. కావున పింఛన్ దారులందరూ మీ ఇంటివద్దనే ఉండాలన్నారు. పింఛన్ కోసం వార్డు సచివాలయాలు, నగర పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. వచ్చి ఇబ్బందులకు గురికావద్దన్నారు.

పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం: ఎంపీడీఓ

హిందూపురం(సోమందేపల్లి), జూన్ 29 : ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధమైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... సోమందేపల్లి మండల వ్యాప్తంగా 6898మంది లబ్దిదారులకు రూ.4,72,58,000ను మూడు నెలల బకాయితో కలిపి ఇంటివద్దే పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, చేనేతలు, వితంతువులు తదితరులకు బకాయి రూ.3వేలు కలిపి అందజేయనున్నట్లు తెలిపారు.

పంపిణీ సజావుగా జరపండి : టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూన్ 29 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక పెంచిన నూతన పింఛన్ పంపిణీ సోమవారం సజావుగా జరిగేలా చూడాలని మండల కన్వీనర్ శ్రీరాములు గ్రామ సచివాలయ సిబ్బందిని కోరారు. ఆయన శనివారం పెనుకొండ పట్టణంలోని సచివాలయ సిబ్బందితో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడు ఏప్రిల్ నెల నుంచి రూ.4వేలు పింఛన్ అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. అందులో భాగంగా జూలై ఒకటోతేదీ సోమవారం రోజు ఈ నెల పింఛన్ రూ.4 వేలు , మూడునెలలకు సంబంధించి రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7వేలు అందించనున్నట్లు తెలిపారు. పింఛన్ దారులు ఇంటివద్దే ఉండాలని అక్కడికే వచ్చి పింఛన్ అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు రమణమ్మ, ఆవుల నరేంద్ర, పూల శ్రీనివాసులు, బొక్సంపల్లి మారుతి, బొక్సంపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

స్టాక్‌పాయింట్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

మడకశిరటౌన్, జూన్ 29: పట్టణంలోని బియ్యం గోడౌన్ స్టాక్ పాయింట్‌ను శనివారం సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ప్రస్తుతం మండలంలో ఎంత బియ్యం సరఫరా అవుతోంది.... తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. సక్రమంగా నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ దుకాణాలకు బియ్యం చేరేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈసందర్భంగా రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

- ఉపాధ్యాయుడి అరెస్టు

హిందూపురం, జూన్ 29: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హిందూపురం మండలం గోళ్లాపురం ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సబ్జావలి గత కొన్ని రోజులుగా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రులు హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మందలించినా ఉపాధ్యాయుడిలో మార్పు రాలేదు. దీంతో ఈ నెల 21న అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఏడో తరగతి విద్యార్థిని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ-2 ప్రసన్న, ఈ నెల 24న పాఠశాలకు వెళ్లి విచారించారు. మరికొంతమంది విద్యార్థినులు కూడా ఉపాధ్యాయుడి ప్రవర్తనపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిందితుడిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండుకు తరలించారు. ఉపాధ్యాయుడు సబ్జావలిని సస్పెండ్ చేశామని ఎంఈఓ గంగప్ప తెలిపారు.

వైష్ ఉడ్ పాఠశాల గుర్తింపు రద్దు

మడకశిరటౌన్, జూన్ 29: నగర పంచాయతీ సమీపంలోని అయ్యవారిపల్లి వద్ద నూతనం గా ప్రారంభించిన వైష్ ఉడ్ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఎమ్మార్సీలో వివరాలు వెల్లడించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు వైష్ ఉడ్ పాఠశాలను తనిఖీ చేశామని తెలిపారు. 1994 జనవరి 1 జీవో నిబంధనల ప్రకారం కొన్ని లోపాలు ఉన్నందున పాఠశాల గుర్తింపును రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యానికి నోటీసులు అందజేశామన్నారు. ఇప్పటికే ఆ పాఠశాలలో చేరిన విద్యార్థులను మరొక పాఠశాలకు చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంఈఓ సూచిం చారు. ఒకవేళ ఇతర పాఠశాలకు విద్యార్థులను చేర్చకపోతే మండల విద్యాశాఖ వారికి ఎలాంటి సంబంధం ఉండదని ఆయన తెలిపారు.


'కోడిగుడ్లు పాడైపోవడంపై చర్యలు తీసుకోండి'

గుడిబండ, జూన్ 29 : మండలంలోని పీసీగిరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కోడిగుడ్లు, చిక్కీలు, చెడిపోవడానికి కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, సీటీ స్వామి ఎంఈఓ రవిచంద్రకుమార్‌కు విన్నవించారు. పాఠశాలలోని కోడిగుడ్లు, చిక్కీలు వారం రోజుల కితం చెడిపోగా, వాటిని పూడ్చివేసిన విషయంపై ఎంఈఓ శనివారం విచారణ చేపట్టారు. అలాగే వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కోడిగుడ్లు, చిక్కీలు విద్యార్థులకు ఇవ్వకుండా కాలయాపన చేయడంతో కుళ్లిపోయాయని ఆరోపించారు. వెంటనే కుళ్లిపోవడానికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఎంఈఓ వారికి తెలిపారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు

మడకశిర(అమరాపురం), జూన్ 29: మండలంలోని హేమావతి, కెశివరం, హలుకూరు గ్రామ సచివాలయాల వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ ఏపీఓ జగదీష్, డీఆర్‌పీ చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల వివరాలు సేకరించడంతోపాటు గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన పనులు, పింఛన్ల పంపిణీ వివరాలను తెలియజేశారు. ఈకార్యక్రమంలో జేఈ జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్ మంజునాథ్, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి కేంద్రాలు: దళిత నాయకులు



మాట్లాడుతున్న దళిత నాయకులు

పావగడ, జూన్ 29 : ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి నెలకొల్పిన పావనగంగా తాగునీటి పథకాలు ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా మూతపడ్డాయని దళిత విమోచన సంఘం జిల్లా కన్వీనర్ హనుమంతరాయప్ప, దళిత సంఘం నాయకులు ఆరోపించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న పావనగంగ నీటి పథకం, అదేవిధంగా శనిమహాత్మ సర్కిల్, కొత్త బస్టాండులోని నీటి కేంద్రాలు స్థాపించి దాదాపు ఎనిమిదేళ్లు అవుతున్నా వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నిరుపయోగంగా వదిలేశారన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు, తహసీల్దార్ చొరవ తీసుకుని వాటిని తెరిపించి , ప్రజలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు రామక్రిష్ణ, నరసింహయ్య, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.